క్లుప్తంగా

విభిన్న ప్రతిభావంతులకు హెచ్‌బీ పరీక్షలు



విద్యార్థులకు రక్త పరీక్షలు చేస్తున్న దృశ్యం

పెద్దాపురం: మండలంలోని పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో శనివారం విద్యార్థులకు హెచ్‌బీ పరీక్షలు నిర్వహించారు. పులిమేరు పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో పాఠశాల డైరెక్టర్ రాయవరపు వీరబాబు, ప్రిన్సిపాల్ సత్యలు విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులను అందజేశారు. నూరు శాతం విద్యార్థులు ఆరోగ్యం ఉన్నట్లు వైద్యసిబ్బంది నిర్ధారించారు. కార్యక్రమంలో పాఠశాల ఏఓ వేణు, బాబి, శివ, శ్రీనివాస్, బుజ్జి పాల్గొన్నారు.

ఖేలో ఇండియా కబడ్డీ రిఫరీగా మురళి



సామర్లకోట: స్థానిక కబడ్డీ క్రీడాకారుడు, జగ్గంపేట ప్రభుత్వ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ బోగిళ్ల మురళీ కుమార్ ఖేలో ఇండియా కబడ్డీకి రిఫరీగా ఎంపికయ్యారు. ఈ విషయాన్ని కబడ్డీ ఉమ్మడి జిల్లా అసోసియేషన్ కార్యదర్శి కొండపల్లి శ్రీనివాస్ శనివారం స్థానిక విలేకర్లకు తెలియజేశారు. ఈ నెల 5వ తేదీ నుంచి 10 తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో కేలో ఇండియా కబడ్డీ పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీలకు సామర్లకోటకు చెందిన మురళీకుమార్ ఎంపిక కావడంపై జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఏవీడీ ప్రసాద్, ఉపాధ్యక్షుడు నిమ్మకాయల కిరణ్, కోశాధికారి తాళ్లూరి వైకుంఠం, జిల్లా కోచ్ పోతుల సాయిప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వర స్వామి గ్రామోత్సవం

సామర్లకోట: మండల పరిధిలోని వేట్లపాలెం వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం ఆలయంలో లక్ష గోవింద గానామృతం, విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. సాయంత్రం గరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం స్వామి వారి శ్రీపుష్పయోగోత్సవాన్ని పురస్కరించుకొని మండల స్థాయి, జిల్లా స్థాయిలోని విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాల్లో భక్త సంఘం నాయకులు గోలి ధర్మరాజు, వల్లూరి శేఖర్‌లు భక్తులకు సేవలందించారు.

వందేళ్ల చెట్టుకు అంటుకున్న నిప్పు



దివిలిలో అగ్నికి ఆహుతవుతున్న చెట్టు

పెద్దాపురం: ప్రత్తిపాడు–సామర్లకోట ప్రధాన రహదారి పెద్దాపురం మండలంలో దివిలి జంక్షన్ వద్ద ఆర్అండ్‌బీ రహదారిని ఆనుకుని ఉన్న నిదురగన్నేరు చెట్టుకు నిప్పు అంటుకోవడంతో సుమారు మూడున్నర గంటలకు పైగా భారీగా ట్రాఫిక్ స్తంభించింది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఎంపీటీసీ భద్రరావు ఇంటి ముందు నూరేళ్లకు పైగా వయసున్న నిదురగన్నేరు చెట్టు తొర్రలో స్థానికులు చెత్తను వేసి నిప్పంటిస్తుంటారు. క్రమేణా చెట్టు తొర్రలోంచి అగ్గిరవ్వలు శనివారం రాత్రి ఏడు గంటల సమయంలో ఒక్కసారిగా పైకి ఎగసి పడడంతో చెట్టంతా మంటలు వ్యాపించాయి. స్థానిక యువత అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించడంతో పెద్దాపురం, ప్రత్తిపాడు మండలాల అగ్నిమాపక సిబ్బంది హుటాహుటీన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అప్పటికే పూర్తిస్థాయిలో మంటలు వ్యాపించడంతో మహావృక్షం గంటల తరబడి కాలుతూనే ఉండడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. రాత్రి 9.30 గంటల తరువాత మంటలు అదుపులోకి రావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. స్థానిక పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ప్రజా సహకారంతోనే క్లీన్ సిటీ

కాకినాడ: నగరాన్ని క్లీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజల తోడ్పాటు ఎంతో అవసరమని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు పేర్కొన్నారు. శనివారం ఆయన 24వ డివిజన్ పద్మనాభనగర్‌లో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. చెత్త సేకరణ, తడి, పొడి చెత్త విభజన తీరును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీలపై శ్లాబ్‌లు వేయడం వల్ల మురుగునీటి పారుదల అవరోధంగా ఉందన్నారు. డ్రైనేజీలలో సిల్ట్ తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన సిబ్బందిని ఆదేశాలు జారీ చేశారు.

కన్నుల వైకుంఠం కుంతీమాధవ రథోత్సవం

- వేద మంత్రాలు, మేళతాళాలతో మార్మోగిన పీఠికాపురి
- భక్తజన సంద్రంతో కిటకిటలాడిన పురవీధులు
- ఉప్పాడ తీరంలో దొంగ దేవుడి చక్రస్నానం నేడు



ప్రత్యేక అలంకరణలో కుంతీమాధవ స్వామి, అమ్మవార్లు



భక్తజన సంద్రం నడుమ దేవేరులతో ముందుకు సాగుతున్న కుంతీమాధవుని రథం

పిఠాపురం: ఆధ్యాత్మిక కేంద్రం పిఠాపురంలో పంచ మాధవ క్షేత్రాలలో ఒకటైన కుంతీమాధవుని దివ్య రథోత్సవం శనివారం రాత్రి కనుల వైకుంఠంగా సాగింది. ఉదయం పిఠాపురం మహారాజా రాజా రావు వేంకట కుమార మహీపతి సూర్యారావు బహద్దూర్ పేరున తొలి అర్చన చేసిన అర్చకులు అధిక సంఖ్యలో వచ్చిన భక్త జనసందోహం నడుమ స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. వేదపండితుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు చక్రవర్తుల నరసింహాచార్యులు, చక్రవర్తుల మాధవాచార్యులు యాజ్ఞీకంలో వేదమంత్రాల నడుమ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను అలంకరించారు. అనంతరం రాత్రి విచిత్ర వేషాలు, తప్పెటగుళ్లు, బ్యాండుమేళాల నడుమ విద్యుద్దీపాలు పూలమాలలతో అలంకరించిన రథంపై పట్టు వస్త్రాలు, వివిధ ఆభరణాలతో ఉత్సవ విగ్రహాలను వేద పండితులు అధిష్టించారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ట్రస్టు బోర్డు చైర్మన్ వరదా శేషు రథోత్సవాన్ని ప్రారంభించారు. ఆలయం నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా ఉప్పాడ సెంటర్ వరకు కొనసాగిన రథాన్ని అశేష భక్త జనవాహిని లాగగా స్వామివారు ముందుకు సాగిపోయారు. అనంతరం వారంతా స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాత్రి 9 గంటలకు ప్రారంభమైన రథయాత్ర తెల్లవారుజాము సుమారు రెండు గంటల వరకు కొనసాగింది. ఉప్పాడ సెంటర్‌లో బాణసంచా కాల్పులు, సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఆలయ ఈఓ సీహెచ్ రమణమూర్తి, ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు ఆలయం వద్ద నిర్వహించిన తీర్థం భక్తులతో కిటకిటలాడింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దుకాణాలతో పాటు కొనుగోలుదారులతో వీధులు కిటకిటలాడాయి. అనంతరం స్వామివారిని ప్రత్యేక రథంపై ఉప్పాడ సముద్ర తీరానికి చక్రస్నానానికి తీసుకువెళ్లారు.



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

నేడు ఉప్పాడ తీర్థానికి దొంగ దేవుడు

ఆదివారం తెల్లవారుజామున దొంగ దేవుడు తీరానికి చేరుకోగానే ఉప్పాడ తీరంలో భక్తులు మాఘ పౌర్ణమి పుణ్య స్నానాలు ఆచరించనున్నారు. పిఠాపురంలో ముందు రోజు రాత్రి రథోత్సవం అనంతరం తెల్లవారుజామున చీకటిలో భక్తులు పోలీసు పహారా నడుమ కుంతీ మాధవుడితో ఊరేగింపుగా ఉప్పాడ తీరానికి చేరుకుని చక్రస్నానం చేయించిన అనంతరం భక్తులు పుణ్య స్నానాలు చేస్తారు. అర్ధరాత్రి చీకటిలో తీసుకురావడం వల్ల దొంగతనంగా ఎవరికీ కనిపించకుండా అందరూ నిద్రావస్థలో ఉండగా వస్తారు కాబట్టి స్వామి వారిని దొంగ దేవుడు అంటారని నానుడి. అనంతరం తిరిగి సాయంత్రం స్వామివార్ని రథంపై ఆలయానికి ఊరేగింపుగా తీసుకురావడం ఆనవాయితీ. గతంలో రథాన్ని ఉప్పాడ వరకు తీసుకెళ్లడం కష్టం కావడంతో ప్రస్తుతం పెద్ద రథం నుంచి స్వామిని చిన్న రథంపై ఊరేగింపుగా ఉప్పాడ తీసుకువస్తున్నారు. దారి పొడవునా భక్తులు ఉండి స్వామిని ఆలయానికి సాగనంపుతారు. మిగతా ఆలయాల్లో దేవుళ్లకు ఆయా ఆలయాల్లో ఉన్న పుష్కరిణిల్లో చక్రస్నానం నిర్వహిస్తుంటారు కాని ఒక్క కుంతీ మాధవునికి మాత్రమే ఎక్కడో దూరంగా ఉన్న ఉప్పాడ తీరానికి తీసుకువెళ్లి స్నానం చేయించడం ఆచారంగా కొనసాగుతోంది.

మాఘపౌర్ణమి స్నానాలకు ఏర్పాట్లు

కొత్తపల్లి: ఉప్పాడ తీరంలో సోమవారం మాఘ పౌర్ణమి పుణ్య స్నానాలకు పంచాయతీ అధికారులు ఏర్పాట్లు చేశారు. పిఠాపురంలోని కుంతీ మాధవస్వామిని దొంగ దేవుడిగా తీరానికి తీసుకువచ్చి చక్రస్నానం చేయించడం ఆనవాయితీ. పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 50 వేల మంది పుణ్య స్నానాలు ఆచరించి తమ పిత్రు దేవతలకు కదళీ ఫలాలను ఇస్తుంటారు. ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై రామలింగేశ్వరరావు ప్రత్యేక బందోబస్తు చేస్తున్నారు. తాగునీరు, పారిశుధ్యంపై తగు జాగ్రత్తలు తీసుకుంటున్నమని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు.

గొంచాల–భద్రాచలం రథోత్సవ పాదయాత్ర



సామర్లకోట నుంచి భద్రాచలం వెళుతున్న రథోత్సవ పాదయాత్ర

సామర్లకోట: మండల పరిధిలోని గొంచాల గ్రామం నుంచి భద్రాచలం సీతారామ చంద్రస్వామి రథోత్సవ పాదయాత్ర శనివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. వాసుదేవ గురు స్వామి ఆధ్వర్యంలో 12వ యాత్ర సీతారామ నామస్మరణతో శ్రీకారం చుట్టారు. ఈ రథోత్సవ పాదయాత్రలో 200 మంది భక్తులు పాల్గొంటున్నారు. యాత్ర గొంచాల నుంచి ఉండూరు మీదుగా సామర్లకోట చేరింది. స్థానిక నూకాలమ్మ ఆలయం వద్ద నూకాలమ్మ పారాయణ కమిటీ అధ్యక్షురాలు సత్తి అరుణ, ఆలయ ధర్మకర్త వలూరి బుల్లియ్యల ఆధ్వర్యంలో రథోత్సవ పాదయాత్రకు స్వాగతం పలికి పాదయాత్ర చేస్తున్న భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఆదివారం పెద్దాపురం నుంచి రాజానగరం, దివాన్‌చెరువు, రాజమహేంద్రవరం, కొవ్వూరు, ధర్మవరం, వెంకటాయపాలెం, గోపాలపురం, కొయ్యలగూడెం, బయ్యనగూడెం, జంగారెడ్డిగూడెం, లక్ష్మీ పురం, అశ్వారావుపేట, అనుపాక, కుడుములపాడు, కుక్కునూరు, అమరవరం, వేలేరు మీదుగా భద్రాచలం చేరుకుంటారని నిర్వాహకుడు వాసుదేవ గురు స్వామి తెలిపారు.

హత్యాయత్నం చేసిన వారిని అరెస్టు చేయాలి



సీఐకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సామర్లకోట: మండల పరిధిలోని పీబీ దేవం గ్రామానికి చెందిన ఫాస్టర్ విలియమ్స్ రాజుపై హత్యాయత్నం చేసినవారిని తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం రాత్రి పోలీస్‌స్టేషన్ వద్ద క్రైస్తవ, మాలమహానాడు నాయకులు ధర్నా నిర్వహించారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న ఫాస్టర్‌ను హత్య చేయడానికి ప్రయత్నించిన వారిని అరెస్టు చేయడంలో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు సీఐ కె.దుర్గాప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు సీఐ మాట్లాడుతూ విలియమ్స్‌రాజు నుంచి వాంగ్మూలం సేకరించి దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను అరెస్టు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆంధ్ర మాలమహానాడు అధ్యక్షుడు లింగం శివప్రసాద్, ఫాస్టర్ ఫెలోషిప్ ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ నాయకులు జి.అమృతరావు, టీవీ ప్రసాద్, రీజియన్ చైర్మన్ పురుషోత్తందాసు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక దీపోత్సవం



సామూహిక దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

సామర్లకోట: మాఘ శనివారాన్ని పురస్కరించుకొని స్థానిక 15వ వార్డు పాత్రుళ్ల పేటలో శనివారం రాత్రి మహిళలచే సామూహిక కుంకుమ పూజలు, దీపోత్సవం నిర్వహించారు. పెద్దాపురం గీతా మందిరం మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కర్రి ఆదినారాయణరెడ్డి, మారిన రాంబాబు, కర్రి రామకృష్ణ, కర్రి నారాయణ, పెదిరెడ్ల కృష్ణ, ఎలిశెట్టి శివాజీ, దన్నిన దుర్గ, కర్రి విజయ్‌లు సేవలందించారు.

జగనన్న కాలనీలను వేగంగా పూర్తి చేయాలి

జెడ్పీ సీఈఓ సత్యనారాయణ



వేట్లపాలెంలోని జగనన్న లేఅవుట్‌ను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ సత్యనారాయణ తదితరులు

సామర్లకోట: జగనన్న కాలనీలను వేగంగా పూర్తి చేసే విధంగా సచివాలయ సిబ్బందితో పాటు మండల స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పరిషత్ సీఈఓ ఎన్‌వీవీ సత్యనారాయణ అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం ఇళ్ల స్థలాలను ఇచ్చి రూ.1.80 లక్షలు ఉచితంగా ఇస్తున్నా ఇళ్ల నిర్మాణాలు మందకొడిగా జరగడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల పరిధిలో వేట్లపాలెం గ్రామంలో జగనన్న లేఅవుట్‌లను ఆయన పరిశీలించారు. మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉన్నవారికి బ్యాంకులు రూ.50 వేల వరకు రుణాలు ఇవ్వడానికి ముందుకొస్తున్నాయన్నారు. లబ్ధిదారులు ఆ మొత్తంతో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని చెప్పారు. ఇళ్లు మరింత అందంగా నిర్మాణం చేసుకోవాలనుకునేవారు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని అద్దెలకు చెల్లించే మొత్తం బ్యాంకు రుణ వాయిదాలకు చెల్లించుకొని సొంత ఇంటిదారులు కావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ డి.శ్రీలలిత, హౌసింగ్ ఏఈ ఎం.వెంకటేశ్వరావు, సచివాలయ ఇంజనీరింగ్ అసిసెంట్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యా ప్రగతి సాధనకు కృషి చేయాలి

ఉపాధ్యాయులకు ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు మధుసూదనరావు పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు మధుసూదనరావు

పిఠాపురం: విద్యా ప్రగతి సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు డి.మధుసూదనరావు సూచించారు. పిఠాపురం బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో శనివారం జిల్లా ఉప విద్యాశాఖాధికారిణి డి.సుభద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయుల సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఆయన విద్యా ప్రగతి సాధనకు నిర్వహించే కార్యక్రమాలు, వాటి అమలు తీరుపై సమీక్షించారు. ఉన్నత పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతులు, విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌ల నిర్వహణపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. ఏప్రిల్‌లో ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

శృంగార వల్లభుడి దర్శనానికి బారులు తీరిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో తిరుపతి శృంగార వల్లభస్వామి



ఆలయ ఆవరణలో భక్తుల రద్దీ

పెద్దాపురం: తొలి తిరుపతి స్వయంభూగా పిలువబడే శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. దీంతో గంటల తరబడి క్యూలైన్లన్నీ కిక్కిరిసిపోయాయి. కాకినాడ జిల్లా దేవాదాయ శాఖ కమిషనర్, ఇన్‌ఛార్జి ఆలయ కార్యనిర్వాహణాధికారి పులి నారాయణమూర్తి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు స్వామి వారికి తులసీ మాలంకరణ చేసి భక్తులకు ఆశీర్వచనం అందించారు. ఆలయ భక్తుల నుంచి అన్నదానం, విరాళాలు, టిక్కెట్ల ద్వారా శనివారం ఒక్కరోజే సుమారు రూ.3,98,165 ఆదాయం సమకూరినట్లు ఈఓ పులి నారాయణమూర్తి తెలిపారు. అనంతరం ఉచిత పులిహోర ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, కర్రి జగదీష్ హాజరయ్యారు.

క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి



ఎమ్మెల్యే కన్నబాబును సత్కరించిన డాక్టరు వీర్రాజు తదితరులు

మాజీ మంత్రి కురసాల కన్నబాబు

సామర్లకోట: క్యాన్సర్ వ్యాధి రాకుండా ఉండటానికి డాక్టరు ఇస్తున్న సలహాలు, సూచనలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మాధవపట్నంలోని సూర్య గ్లోబల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ పీఎస్ వీర్రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కన్నబాబు మాట్లాడుతూ పేద ప్రజలకు ఉచితంగా వైద్యం అనే అద్భుత అభయహస్తం ఇస్తున్నారని ఆస్పత్రి సిబ్బంది సేవలను కొనియాడారు. అనంతరం వైద్య సిబ్బంది కన్నబాబును సత్కరించారు.

రక్తదాన శిబిరం

కొత్తపల్లి: స్థానిక వీపీఎస్ విద్యా సంస్థల ఆడిటోరియంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యా సంస్థ కరస్పాండెంట్ అనిశెట్టి కృష్ణారెడ్డి, కాకినాడకు చెందిన రోటరీ క్లబ్ వైద్యుడు కామరాజు పర్యవేక్షణలో శిబిరం నిర్వహించారు.

టెన్షన్... టెన్షన్.. దివిలి జంక్షన్

- నిరంతర ట్రాఫిక్‌తో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు
- కలగా మిగిలిన రహదారి విస్తరణ పనులు
- గంటల తరబడి స్తంభిస్తున్న వాహనాలు



ఉదయం వేళ దివిలి జంక్షన్‌లో నిలిచిపోయిన ట్రాఫిక్



నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో రాత్రి సమయంలో నిలిచిపోయిన వాహనాలు

పెద్దాపురం: నిత్యం రద్దీగా ఉండే సామర్లకోట–ప్రత్తిపాడు రహదారిలోని దివిలి జంక్షన్‌లో వాహనదారులు ట్రాఫిక్ కారణంగా నరకయాతన పడుతున్నారు. ఉదయం, సాయంత్రం, రాత్రి అన్న తేడా లేకుండా అక్కడ ఏర్పడుతున్న ట్రాఫిక్ ఇబ్బందులతో రోడ్డుపై అడుగుపెడితే తిరిగి గమ్యస్థానానికి చేరుకునేదెపుడో అర్థం కాని పరిస్థితి నెలకొంది. విద్య, వ్యాపారపరంగా అభివృద్ధి చెందిన పెద్దాపురం మండలం దివిలి, చంద్రమాంపల్లి గ్రామాల ప్రధాన రహదారి తరచూ ట్రాఫిక్ వలయంలో చిక్కుకుంటుంది. ఉదయాన్నే పాఠశాల, కళాశాలలకు వెళ్ళాల్సిన విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారుల వాహనాలు ఇదే జంక్షన్ నుంచి ప్రయాణించాల్సి ఉంటుంది. అటు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం కాక, ఇటు ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రోడ్డు విస్తరణకు మార్జిన్‌లు ఇచ్చినా..

రహదారి విస్తరణకు గాను గత పాలకులు ప్రణాళికబద్ధంగా రోడ్డు విస్తరణ పనులు చేపడతామని హామీ ఇచ్చినా అది కాస్త అటకెక్కించారు. అప్పట్లోనే రోడ్డు విస్తరణ పనులకు గాను ఆయా దుకాణాల తొలగింపు మార్జిన్‌లు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నా అధికార యంత్రాంగం, గత పాలకుల తీరు 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా తయారైంది. నిత్యం రద్దీగా ఉండే రహదారి విస్తరణ పనులు చేపడుతున్నారని ప్రజలు సంబరపడిన రెండు రోజులకే అభివృద్ధి పనులు ఆగిపోవడంతో ప్రజలు అవాక్కయ్యారు. గత నాలుగేళ్లుగా విస్తరణ పనులు చేపడతారని ఆశ అడియాశ కావడంతో నిత్యం ట్రాఫిక్ రద్దీ కారణంగా ఇబ్బందులు తప్పడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆక్రమణలతోనే ట్రాఫిక్ ఇబ్బందులు

అసలు కన్నా కొసరు మిన్న చందంగా తయారైంది చంద్రమాంపల్లి గ్రామ వ్యాపారుల దుస్థితి. రోడ్డు విస్తరణ పనుల్లో అవసరమైన మార్జిన్ మేరకు దుకాణాలు తొలగించకపోయినా ఆయా దుకాణాల వద్ద ఎదురుగా అద్దెలకు వేరే దుకాణాలు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందనడంలో ఏమాత్రం సందేహం లేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు, పాలకులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

హామీ తప్ప ఆచరణ శూన్యం



రహదారి విస్తరణ పనులు చేపట్టుతామన్న గత పాలకుల హామీ ఆచరణకు నోచుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో దుకాణదారులను వెనక్కి జరిగేలా పోలీసులు నోటీసులు జారీ చేశారు. అది కాస్త నెల రోజులు గడవకుండానే రోడ్ల పైకి దుకాణాలు చేరాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి.

– వట్టికూటి రాజ్‌కుమార్, దివిలి

సిబ్బందిని నియమించాం



చంద్రమాంపల్లి(దివిలి) జంక్షన్‌లో ట్రాఫిక్ నియంత్రణకు గాను సిబ్బందిని నియమించాం. ప్రతిరోజూ ట్రాఫిక్ పోలీసును ఏర్పాటు చేసి ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. విస్తరణ పనులకు మిగిలిన శాఖాధికారులు ముందుకొస్తే ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం.

– వెలుగుల సురేష్, ఎస్‌ఐ, పెద్దాపురం

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠ

సామర్లకోట: స్థానిక కొత్తూరు, తాండ్ర పాపారాయుడు విగ్రహం సమీపంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శనివారం షిర్డీ సాయిబాబా, దత్తాత్రేయ, వినాయక స్వామివార్ల విగ్రహాలను ఆలయ కమిటీ దంపతులచే భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. అనంతరం ఆలయంలో హోమం, పూర్ణాహుతి, అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్‌పర్సన్లు ఊబా జాన్‌మోజెస్, గోకిన సునేత్రదేవి, కౌన్సిలర్లు గుబ్బల సత్యనారాయణ, రెడ్డి లోవకుమారి, పాగా సురేష్‌కుమార్, బలుసు వాసు పాల్గొన్నారు.

శాప్ లీగ్ హాకీ విజేత కాకినాడ

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఈనెల 3, 4 తేదీల్లో నిర్వహించిన శాప్ లీగ్ హాకీ పోటీల్లో కాకినాడ జట్టు విజేతగా నిలిచింది. అండర్–19 యూత్ చాంపియన్‌షిప్ పద్ధతిలో నిర్వహించిన పోటీలలో 12 జిల్లాల జట్లు పాల్గొన్నాయి. రెండో సెమీస్‌లో డాక్టర్ వైఎస్సార్ కడప జట్టు నెల్లూరు జట్టుపై 3–0 స్కోర్‌తో విజయం సాధించి ఫైనల్స్‌కు వచ్చింది. ఫైనల్స్‌లో కాకినాడ జట్టు గెలిచింది